జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

ఆదివారం 30 11 2025

సంపుటి 1 సంచిక 10

పేజీలు : 04

RNI : TGTEL/25/A4195



విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు

మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు

7337546647

(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)




## కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది:

చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెసిఆర్ తెలిపారు. తెలంగాణ కోసం చేసే ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లింది మాజీ సిఎం కెసిఆర్ అని కొనియాడారు. తెలంగాణలో బిఆర్ఎస్ దీక్షా దివాస్ నిర్వహించారు.

2



## ఎస్పీబీ విగ్రహం ఆవిష్కరణ.

దశ, హైదరాబాద్:ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం కలిశారు. డిసెంబర్ 15న రవీంద్ర భారతి ఆవరణలో ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు స్వర్గీయ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు.



## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ" ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.

3



## కేసీఆర్ దీక్షతోనే

# తెలంగాణ రాష్ట్రం

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**దశ, ఎల్బీనగర్ :** కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది పడిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం దీక్షా దివస్ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ బస్ స్టాప్, హయత్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర రక్తదాన శిబిరం, మెగా హెల్త్ క్యాంపు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో తిరుగుబాటు జ్వాల పుట్టిన రోజు 2009 నవంబర్ 29 అన్నారు. ఆనాడు కేసీఆర్ ఇచ్చిన పిలుపు కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో... అనే మాట తెలంగాణ ప్రజలను కదిలించిందన్నారు. దీక్షా దివస్ మన గౌరవం, మనగర్వం అని పేర్కొన్నారు.అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భవాని ప్రవీణ్ కుమార్, సామ తిరుమల రెడ్డి, రమేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, చెన్నగొని శ్రీధర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి, భాస్కర్ సాగర్, శ్రావణ్, అంజలి, రమణారెడ్డి, రాము, యాద శంకర్, స్కైలాబ్, ప్రదీప్, రాకేశ్, పారంద రమేశ్, సత్తిరెడ్డి, శ్రీకాంత్, రాధిక, లక్ష్మణ్, ఇంద్రకరణ్, విక్కీ, విజయ, మధు, వర్షిత్, వాణి, నాగమణి, లక్ష్మి, నగేశ్, దేవరం నాయక్, శంకర్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన తొలి దశ సర్పంచ్ ఎన్నికల

# నామినేషన్ల పర్వం



- గురువారం మొదలైన నామినేషన్ల స్వీకరణ
- శనివారం సాయంత్రం ముగిసిన నామినేషన్ల స్వీకరణ
- మొదటి విడతలో భాగంగా 189 మండలాల్లో 4236 సర్పంచ్ స్థానాలు, 37,440 వార్డులకు ఎన్నికలు
- రేపటి నుంచి రెండో విడత నామినేషన్లు

**దశ, రంగారెడ్డి :** తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. గురువారం మొదలైన నామినేషన్ల స్వీకరణ ఇవాళ సాయంత్రం 5 గంటలతో ముగిసింది.మొదటి విడత ఎన్నికల్లో భాగంగా 31 జిల్లాల్లో 189 మండలాల్లో 4236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు ఎన్నికలు నిర్వహించబోతున్నారు. రేపు నామినేషన్లను పరిశీలించి చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితాను అధికారులు రెడీ చేయనున్నారు. ఒక వేళ సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థి నామినేషన్లు తిరస్కరణకు గురైతే సదరు అభ్యర్థి సంబంధిత రెవెన్యూ డివిజనల్, సబ్ కలెక్టర్ వద్ద రిటర్నింగ్ అధికారిపై డిసెంబర్ 31 వరకు అప్పీల్ చేసుకోవచ్చు. డిసెంబర్ 2న అప్పీళ్లను పరిష్కరిస్తారు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అభ్యర్థులు ప్రకటించి వారికి ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో

..మిగతా 2వ పేజీలో

## దొరకని ఎస్సై రివాల్వర్




- పోలీసులకు పెను సవాల్
- బెట్టింగ్ వ్యసనానికి బానిసై, అప్పులు తీర్చేందుకు తుపాకీని అమ్ముకున్నాడనే అనుమానాలు

**దశ, హైదరాబాద్:** అంబర్‌పేట ఎస్ఐ భానుప్రకాశ్‌కు చెందిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ అదృశ్యం కేసు పోలీసులకు పెను సవాల్‌గా మారింది. బెట్టింగ్ వ్యసనానికి బానిసైన ఆయన, అప్పులు తీర్చేందుకు తన తుపాకీని అమ్ముకున్నాడనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు విచారణలో భానుప్రకాశ్ పొంతనలేని సమాధానాలు ఇస్తూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడు.మొదట తన డ్రాలో రివాల్వర్ కనిపించడం లేదని చెప్పిన భానుప్రకాశ్, ఆ తర్వాత విజయవాడలోని ఓ లాడ్జిలో మర్చిపోయినట్లు కథ అల్లాడు. దీంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడ వెళ్లి లాడ్జి సిబ్బందిని, యజమానిని విచారించి, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ తుపాకీకి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో ఆయన చెబుతున్న మాటల్లో నిజం లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

..మిగతా 2వ పేజీలో

## 7000 మంది ఉద్యోగులపై

# పిడుగు..



### రిటైర్మెంట్ బెనిఫిట్లు రాకుండా ఆర్డినెన్స్

### రూ.20వేల కోట్లు నష్టం

### ఈ గెజిట్ వల్ల రూ.20వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు మిగులు

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని సుమారు ఏడు వేల మంది ఉద్యోగులకు పిడుగులాంటి వార్త ఇది. తాత్కాలిక ప్రాతిపదికన నియామకమై ఆ తర్వాత వివిధ ప్రభుత్వాల హయాంలో రెగ్యులరైజ్ అయిన వారు, నాన్ మస్టర్‌రోల్ (ఎన్ఎంఆర్)గా చేరినవారు, న్యాయస్థానాల ద్వారా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయించుకున్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్లను ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆగమేఘాలపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్ గవర్నర్ పేరున గెజిట్ కూడా విడుదలైంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు ఏడువేల మంది ఉద్యోగులు నికరంగా రూ.20వేల కోట్లు నష్టపోనున్నారు. ఈ గెజిట్ వల్ల రూ.20వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు మిగులుతాయని ప్రభుత్వం చెప్తున్నది.రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారం కాకూడదంటే ఈ ఉద్యోగులకు పదవీ విరమణ బెనిఫిట్లు ఏమీ ఉండకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, సాధారణ పరిపాలనాశాఖల అధికారులు ఏకంగా ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చారు. ఈ నివేదికను ప్రభుత్వం మంత్రివర్గ సమావేశాల్లో చర్చించి ఆమోదించింది. అందుకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఇచ్చింది. ఈ నెల 25న గెజిట్ కూడా జారీ అయింది.

..మిగతా 2వ పేజీలో

### ఎవరా ఉద్యోగులు?

రాష్ట్రంలో 2/94 యాక్ట్ ప్రకారం వివిధ శాఖల్లో, ముఖ్యంగా నీటిపారుదల, విద్య, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో టైమ్ స్కేల్‌పై పనిచేసినవారిని, ఎన్ఎంఆర్‌గా చేరినవారు, అయిదేండ్లు, పదేండ్లకుపైగా పనిచేసిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. అంతకుముందు కూడా కొంతమంది ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. వారు తమను కూడా రెగ్యులర్ ఉద్యోగులుగానే పరిగణించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్నట్టు ఉద్యోగ విరమణ బెనిఫిట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్లను లెక్కించేందుకు తాము తాత్కాలిక ఉద్యోగిగా ఎప్పుడైతే ఉద్యోగంలో చేరామో..

..మిగతా 2వ పేజీలో



## రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో

# ఘనంగా దీక్షా-దివస్..

**దశ, రంగారెడ్డి :** శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన దీక్షా-దివస్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో పలువురు మాట్లాడారు. తెలంగాణ సాధకులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తరువాత కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్రం కోసం సుదీర్ఘంగా పోరాడిన ఉద్యమ నేత కేసీఆర్ "తెలంగాణ వచ్చుడోకేసీఆర్ సచ్చుడో" అని చేసిన దీక్షను స్మరించుకున్నారు. కేసీఆర్ గారు ఒక నాయకుడు మాత్రమే కాదనీ, తెలంగాణ కోసం అచంచల సంకల్పంతో ప్రాణత్యాగానికి సిద్ధమైన మహా శక్తి, మహనీయుడు అని పేర్కొన్నారు. భారతదేశంలో ఇంతటి దీక్షను అటువంటి దృఢ నిశ్చయంతో చేసిన నాయకుడు మరెవరూ లేరని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా ఉద్యమ నాయకులను శాలువాలతో

..మిగతా 2వ పేజీలో

## హైదరాబాద్‌కు మెస్సీ...



మంత్రముగ్ధులను చేసే లియోనెల్ మెస్సీ. టికెట్ ధరలు రూ. 1,250 నుంచి రూ.13,500 వరకు. 2011 తర్వాత ఇండియాకు మెస్సీ రాబోతుండటం ఇదే మొదటి సారి.

2వ పేజీలో

## క్రీడలతో దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం : జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత



**దశ, రంగారెడ్డి:** వికలాంగులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి శ్రీలత అన్నారు. శనివారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత జెండా ఊపి,మార్చి ఫస్ట్ నిర్వహించి,క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆకాశంలోకి బేలున్స్ వదిలి,క్రీడా కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి శ్రీలత మాట్లాడుతూ,,, దివ్యాంగులు వికలాంగులతో సమానంగా తమ ప్రతిభను

..మిగతా 2వ పేజీలో

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..





## అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ కు "శ్రీసత్యసాయి సేవా పురస్కారం

**దశ, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ "శ్రీ సత్యసాయి సేవా పురస్కారం 2025" అందుకున్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్వర్యంలో శనివారం ఉదయం చిక్కడపల్లిలోని త్యాగరాజ గానసభలో భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో సాహితీ, కళా, సేవా రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులను సన్మానించారు. ఇందులో భాగంగా మార్గం రాజేశ్ కు "శ్రీ సత్యసాయి సేవా పురస్కారం 2025" అవార్డును ఆధ్యాత్మిక రచయిత్రి, కళారత్న డాక్టర్ కేవీ కృష్ణ కుమారి అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్ రాజు మాట్లాడుతూ... మార్గం రాజేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అనాథ, నిరుపేద విద్యార్థులకు మూడు దశాబ్దాలుగా ఉచితమైన భోజన, వసతి, అన్ని విద్యా సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు, సినీ దర్శకుడు మాగంటి ప్రసాద్ బాబు, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాధ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన తొలి దశ సర్పంచ్ ఎన్నికల

# నామినేషన్ల పర్వం

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులు ప్రచారంపై ఫోకస్ పెట్టారు. ఓటర్లను తమ వైపు ఆకర్షించేలా హామీలు ఇచ్చేందుకు ప్రత్యర్థులతో పోటీ పడుతున్నారు.

**రేవంత్ రెడ్డి గ్రామం ఏకగ్రీవం:**
మొదటి విడత ఎన్నికలు జరగాల్సిన పంచాయతీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఏకగ్రీవాల సందడి నెలకొంది. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయింది. రేవంత్ రెడ్డి చిన్ననాటి మిత్రుడు, క్లాస్ మేట్ వెంకటయ్య సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ స్థానం ఎస్సీకి రిజర్వ్ కాగా మొత్తం 15మంది పోటీ పడ్డారు. ఈ క్రమంలో గ్రామపెద్దలు అంతా కలిసి సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేశారు.

**రేపటి నుంచి రెండో విడత నామినేషన్లు:**
రేపటి నుంచి రెండో విడత ఎన్నికల కోసం నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో నామినేషన్ల స్వీకరణకు డిసెంబర్ 2 వరకు తుది గడువు విధించారు. డిసెంబర్ 3వ తేదీన నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి వారికి ఎన్నికల గుర్తును కేటాయించనున్నారు. వచ్చే నెల 14న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితం ప్రకటిస్తారు.

# 7000 మంది ఉద్యోగులపై పిడుగు..

మొదటి పేజీ తరువాయి

గెజిట్ కాపీ, ప్రభుత్వ ఉత్తర్వులను దాచిపెట్టారు. ఇప్పటివరకు ఎక్కడ ఎలాంటి చర్చలు లేకుండా.. ఉద్యోగులకు తెలియకుండానే ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని ఏడు వేల మందికిపైగా ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్లను కోల్పోనున్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తం రూ.20వేల కోట్లు ఆదా అవుతుందని ప్రభుత్వం క్యాబినెట్‌కు సమర్పించిన నివేదికలోనే పేర్కొన్నది.

### ఎవరా ఉద్యోగులు?


మొదటి పేజీ తరువాయి

అప్పటి నుంచే సర్వీసును లెక్కించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో, కొన్ని శాఖల్లో ప్రభుత్వం వారి డిమాండ్లను అంగీకరించి బెనిఫిట్లను ఇచ్చింది. ప్రభుత్వం ఒప్పుకోని పరిస్థితుల్లో అలాంటి ఉద్యోగులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. న్యాయస్థానాలు కూడా ఉద్యోగుల సర్వీసును లెక్కించే విధానాలపై ఎప్పటికప్పుడు ఉత్తర్వులు ఇచ్చింది. వందలాది మంది ఉద్యోగ విరమణ సమయంలో తమ సర్వీసును తాత్కాలిక ఉద్యోగిగా పనిచేసిన కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని బెనిఫిట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ప్రభుత్వం వినకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించి విజయం సాధించారు. పాత జీతం, డీఏలతోపాటు ఇవ్వాలని కూడా ప్రభుత్వాలను కోర్టులు ఆదేశిస్తున్నాయి.

# సైబర్ నేరగాళ్ల వలలో..
# 14 కోట్లు నష్టపోయిన డాక్టర్

**అమ్మాయి పేరుతో చాట్.**

**పోలీసులు విచారణ మొదలు.**



**దశ, హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుణ్ని మోసం చేసి 14 కోట్లను స్వాహా చేశారు. అమ్మాయి పేరుతో చాట్ చేసి ట్రేడింగ్ చేస్తూ నిలువునా ముంచేశారు. చివరకు తాను మోసపోయినట్టు ఆలస్యంగా గ్రహించిన ఆ డాక్టర్ పోలీసులను సంప్రదించి వివరాలు అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ నెంబర్లు, ఇతర సాక్ష్యాలు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఎన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నా, ఎంతలా హెచ్చరికలు చేస్తున్నా, ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉంటున్నా సరే సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు.

ఏదో రూపంలో ప్రజలను మాయ చేసి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఇలాంటి కేసు ఒకటి హైదరాబాద్‌లో వెలులోకి వచ్చింది. సోషల్ మీడియాలో ఏర్పడిన పరిచయం ఆ డాక్టర్‌కు 14 కోట్లు పోయేలా చేసింది. ట్రేడింగ్ పేరుతో ముందుగా లాభాలు చూపించి ఓ దశ దాటిన తర్వాత నిలువునా ముంచేశారు. ఈ మధ్య కాలంలో స్టాక్ మార్కెట్లు, ఇతర ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఏఐ టెక్నాలజీ పెరగడంతో దాని ఆధారంగానే ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్‌ను కూడా ఇలానే మోసం చేశారు. సోషల్ మీడియాలో ఆయనకు మొదట ఓ రిక్వెస్ట్ వచ్చింది. అందులో మోనిక పేరుతో రిక్వెస్ట్ వచ్చింది.

అందులో అందమైన యువతి ఫొటో ఉంది. రిక్వెస్ట్‌కు ఓకే చెప్పరు డాక్టర్. తర్వాత వారి మధ్య చాలా కాలం చాటింగ్ నడిచింది. మధ్యలో బిజినెస్ ప్రస్తావన వచ్చింది. తనకు ట్రేడింగ్‌లో మంచి ఎక్స్‌పీరియన్స్ ఉందని చెప్పి మాయమాటలు చెప్పింది. వాటిని అంతగా నమ్మకం కుదరలేదు. కానీ చూద్దాంలే అని చెప్పి కాస్త తక్కువ పెట్టుబడితోనే మొదలు పెట్టారు. అంతే వాటికి భారీ లాభాలు వచ్చాయి. ఇలా వారు పంపించిన లింక్‌లు ఆధారంగా పెట్టుబడులు పెట్టారు.

మొదట్లో లాభాలు రావడంతో పెట్టుబడి పెంచారు. అయితే ఒక స్థాయి దాటిపోయిన తర్వాత లాభాలు కనిపిస్తున్నాయి కానీ వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా పోయింది. అప్పటికే పెద్దగా నష్టాలు లేనందున వాటి గురించి డాక్టర్ పట్టించుకోలేదు. కానీ అటు నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. కొద్దిగా ట్యాక్స్ కట్టేస్తే ఆ డబ్బులు వస్తాయని కూడా చెప్పింది. దీన్ని కూడా పట్టించుకోలేదు. కానీ ఒత్తిడి పెరగడంతో డబ్బులు ఊరికే ఎందుకు వదులుకుంటారని చెప్పడంతో మనసు మెత్తబడింది. వారు చెప్పినట్టుగా పంపిన లింక్‌ల ద్వారా వాళ్లు చెప్పిన డబ్బులు పే చేశారు.

అంతే అప్పటి వరకు తరచూ వచ్చేఫోన్‌లు రావడం మానేశాయి. మోనిక కూడా స్పందించడం లేదు.దీంతో మోసపోయినట్టుగా భావించిన డాక్టర్ పోలీసులను ఆశ్రయించాడు. మొత్తంగా సైబర్ నేరగాళ్లకు 14కోట్లు ముట్టచెప్పినట్టు తేలింది. వివరాలు తెలుసుకున్న పోలీసులు విచారణ మొదలు పెట్టారు.

## కాంగ్రెస్ పార్టీ కుట్రలు,
# కుతంత్రాలు చేస్తోంది

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్



**దశ, హైదరాబాద్:** చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెసిఆర్ తెలిపారు. తెలంగాణ కోసం చేసే ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లింది మాజీ సిఎం కెసిఆర్ అని కొనియాడారు. తెలంగాణలో బిఆర్ఎస్ దీక్షా దివాస్ నిర్వహించారు. కెసిఆర్ తెలంగాణ దీక్షకు 16 ఏళ్లు గడిచినందుకు తెలంగాణ భవన్ లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ కోసం పదవులు సైతం ఆయన వదిలేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు.

కౌరవులను కొట్టి మళ్లీ అధికారం లోకి వస్తామని, తెలంగాణ సంకెళ్లు తెంచిన నాయకుడు కెసిఆర్ అని తెలియజేశారు. ఉద్యమకాలంలో సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని బలి దేవత అని తిట్టారని కెటిఆర్ పేర్కొన్నారు. కెసిఆర్ దీక్ష స్ఫూర్తితో పోరాడతామని, తెలంగాణకు మొదట్నుంచి కాంగ్రెస్ విలన్ అని మండిపడ్డారు. కెసిఆర్ ఏడాదిన్నరగా బయటకు రావట్లేదని అంటున్నారని, గోడకు వేలాడదీసిన తుపాకీ కూడా సైలెంట్ గా ఉంటుందని అన్నారు. కానీ.. బయటకు వచ్చినప్పుడు ఎలా పేలుతుందో తెలుస్తుందని సూచించారు. ఇప్పుడున్న సిఎం రేవంత్ రెడ్డి కెసిఆర్ పేరు లేకుండా ఒక్క ప్రసంగం చేశారా? అని ప్రశ్నించారు.

నాయకుడు ఎప్పటికైనా నాయకుడే.. అర్భకుడు ఎప్పటికైనా అర్భకుడే అని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వస్తే సంగతి తెలుస్తుందని, తెలంగాణ తల్లిని అవమానించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసి కాంగ్రెస్ తల్లిని పెట్టారని, తెలంగాణ తల్లి స్థానంలో రాహుల్ గాంధీ తండ్రిని పెట్టారని దుయ్యబట్టారు. కాళేశ్వరం కాంగ్రెస్ కు శాపం కావచ్చు.. తెలంగాణకు మాత్రం వరం అని.. మేడిగడ్డ ఆనకట్టకు బాంబులు పెట్టి పేల్చే ప్రయత్నం జరిగిందని కెటిఆర్ ధ్వజమెత్తారు

## దొరకని
# ఎస్సై రివాల్వర్

మొదటి పేజీ తరువాయి

భానుప్రకాశ్ తీవ్రమైన బెట్టింగ్ వ్యసనపరుడని, శిక్షణలో ఉన్నప్పటి నుంచే ఈ అలవాటు ఉందని ఆయన సహచరులు చెబుతున్నారు. తోటి సిబ్బంది, ఇతరుల వద్ద సుమారు రూ.60 లక్షల వరకు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ అప్పుల కోసమే తుపాకీని మొదట రూ.5 లక్షలకు కుదువపెట్టి, ఆ తర్వాత రాయలసీమకు చెందిన ఓ గ్యాంగ్‌కు అమ్మేశాడనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంలో పోలీసులకు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన క్లూ లభించలేదు.గతంలో ఓ బంగారం రికవరీ కేసులో సస్పెండ్ అయినప్పుడు నిబంధనల ప్రకారం సర్వీస్ రివాల్వర్‌ను డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాల్సి ఉన్నా, ఆయన తన వద్దే ఉంచుకోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అవుతున్నారు. ఈ గన్ మిస్సింగ్ వ్యవహారంపై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. కేసును త్వరగా ఛేదించాలని టాస్క్‌ఫోర్స్‌పై ఒత్తిడి తెస్తున్నారు.



### రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో

# ఘనంగా దీక్షా-దివస్..

మొదటి పేజీ తరువాయి

సత్కరించారు. ఈ వేడుకలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్ , జైపాల్ యాదవ్ , రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , ఉద్యమ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శించాలని సూచించారు. జూనియర్ కేటగిరీలలో 10 నుంచి 16 సంవత్సరాల వయస్సు వారు,సీనియర్ విభాగంలో 17 నుంచి ఆపై వయస్కులు (బధిరులు,అంధులు, శారీరక, మానసిక వైకల్యంగల దివ్యాంగులు) పాల్గొన్నారని అన్నారు.ఈ క్రీడా పోటీలలో ముఖ్యంగా పరుగు పందెం,షార్ట్ పుట్,క్యారమ్స్,జావలిన్ త్రో,మరియు చదరంగం వంటి అంశాలలో ఆయా కేటగిరీల వారీగా వివిధ భాగాలలో పోటీలు నిర్వహించి వారికి నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహసం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలోని వివిధ దివ్యాంగుల సంఘాల వారు, వసతి గృహాల విద్యార్థులు, దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థలవారు, ఐసిడిఎస్ శాఖలోని సిడిపిఓలు,సూపర్వైజర్లు డీడబ్ల్యూ ఆఫీస్ సిబ్బంది, డిఆర్డిఏ.శాఖకు సంబంధించిన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు..

# హైదరాబాద్‌కు మెస్సీ...



**దశ, హైదరాబాద్:** యావత్ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను తన మాయాజాలంతో మంత్రముగ్ధులను చేసే లియోనెల్ మెస్సీ.. త్వరలో హైదరాబాద్ రానున్నాడు. ఆయన "సి యు సూన్ ఇండియా !" అని ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకే ఒక్క పోస్టు పెట్టగానే.. దేశంలోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో నెట్టింట రచ్చ చేస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది నగరాల్లో అయితే అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. 2011 తర్వాత ఇండియాకు మెస్సీ రాబోతుండటం ఇదే మొదటి సారి.మొదట్లో మెస్సీ ఇండియా టూర్‌ను కోల్‌కతా, ముంబై, ఢిల్లీ వరకే పరిమితం చేశారు. అయితే అభిమానుల డిమాండ్ నేపథ్యంలో.. ఆర్గనైజర్స్ షెడ్యూల్‌లో మార్పులు చేసి.. హైదరాబాద్‌ను ప్రత్యేకంగా టూర్‌లో చేర్చారు. ముందుగా అహ్మదాబాద్, కేరళలను పరిశీలించినా షెడ్యూల్ సమస్యలతో అది సాధ్యంకాలేదు. చివరకు హైదరాబాద్‌కు అదృష్టం కలిసొచ్చింది.హైదరాబాద్‌లో మెస్సీ ఈవెంట్‌కు టికెట్లు విడుదలయ్యాయి. బుకింగ్ ప్లాట్‌ఫామ్, District App ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. టికెట్ ధరలు రూ. 1,250 నుంచి రూ.13,500 వరకు ఉన్నాయి. డిసెంబర్ 13, శనివారం, రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో సాయంత్రం 7 గంటల నుంచి మెస్సీ సందడి చేయనున్నాడు. హైదరాబాద్‌లో జరిగే GOAT టూర్‌కు ప్రత్యేక కంటెంట్ సిద్ధమవుతోంది. అభిమానుల కోసం మెస్సీ పాల్గొనే ప్రత్యేక ఎగ్జిబిషన్ మ్యాచ్, యువతకు ఫుట్‌బాల్ క్లినిక్, మ్యూజికల్ ట్రిబ్యూట్, మెస్సీకి ప్రత్యేక ఫెలిసిటేషన్ కార్యక్రమం, ఫ్యాన్ ఇంటరాక్షన్స్ వంటి ప్రొగ్రామ్స్ ఏర్పాటు చేశారు. మెస్సీకి ప్రపంచవ్యాప్తంగా ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ ఈవెంట్ కోసం ప్రభుత్వం చాలా ఖచ్చితమైన ప్లానింగ్ చేస్తోంది. టికెట్లు వేగంగా సేల్ అవుతున్నాయి

# కాంగ్రెస్ పార్టీతోనే యాదవులకు రాజ్యాధికారం

- **రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్.**
- **నాగోల్ లో అఖిల భారత యాదవ మహాసభ సమ్మేళనం.**



**దశ, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ పార్టీతోనే యాదవులకు రాజ్యాధికారం సాధ్యమని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్ లో శనివారం అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో విజయం సాధించిన వల్లాల నవీన్ యాదవ్ ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులు రాజకీయ, సామాజిక, ఆర్థిక వెనుకబడిపోయారని అందుకు ముందుకు రావాలంటే సమిష్టి బలం అవసరమన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఎన్ని రాజకీయ పార్టీలు ఉనప్పటికీ సరైన గుర్తింపు రాలేదని, నేడు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతను ప్రోత్సహించాలని ముందుకు సాగడంతో యాదవ సామాజిక వర్గానికి అవకాశాలు, సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. తాను యువజన కాంగ్రెస్ నుంచి జాతీయ స్థాయికి ఎదిగినందుకు పార్టీ గుర్తింపు ఇచ్చి రాజ్యసభకు పంపిందని అనిల్ కుమార్ గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్‌పై నమ్మకం ఉంచి టికెట్ ఇచ్చిన పార్టీ నిర్ణయం సముచితం అయ్యిందని, ఆయన గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ కుమార్ మాట్లాడుతూ... నిస్వార్థానికి నిలువుటద్దం యాదవ సామాజిక వర్గం అని అన్నారు. యాదవ సామాజిక వర్గం సహాయ సహకారాలు లేని ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించలేక పోయిందన్నారు. 40 సంవత్సరాలుగా అన్ని రాజకీయ పార్టీలు ఎన్ని ఇబ్బందులు గురి చేసినా ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని అవమానాలు చేసినా వాటన్నింటినీ తట్టుకొని నిలబడినందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో అవకాశం కల్పించడం దీంతో అందరి సహాయ సహకారాలు ఆదర అభిమానాలు ఆశీర్వాదం పొంది, విజయం సాధించానన్నారు. హైదరాబాద్ నగరంలో యాదవ సామాజిక వర్గానికి హాస్టల్ భవనం కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలో నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదవులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. యాదవ కులస్తులంతా సీఎం రేవంత్ రెడ్డి వెంబడి ఉంటరని తెలిపారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్, నేషనల్ జనరల్ సెక్రటరీ ఆర్.లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు యశ్వంత్, రాష్ట్ర సెక్రటమ్ దొంతి బోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర విఫ్ ఎం.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో దివ్యాంగుల్లో
# ఆత్మవిశ్వాసం

మొదటి పేజీ తరువాయి

ప్రదర్శించాలని సూచించారు.జూనియర్ కేటగిరీలలో 10 నుంచి 16 సంవత్సరాల వయస్సు వారు,సీనియర్ విభాగంలో 17 నుంచి ఆపై వయస్కులు (బధిరులు,అంధులు, శారీరక, మానసిక వైకల్యంగల దివ్యాంగులు) పాల్గొన్నారని అన్నారు.ఈ క్రీడా పోటీలలో ముఖ్యంగా పరుగు పందెం,షార్ట్ పుట్,క్యారమ్స్,జావలిన్ త్రో,చదరంగం వంటి అంశాలలో ఆయా కేటగిరీల వారీగా వివిధ భాగాలలో పోటీలు నిర్వహించి వారికి నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహసం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలోని వివిధ దివ్యాంగుల సంఘాల వారు,వసతి గృహాల విద్యార్థులు,దివ్యాంగులు ,స్వచ్ఛంద సంస్థలవారు,ఐసిడిఎస్ శాఖలోని సిడిపిఓలు,సూపర్వైజర్లు డీడబ్ల్యూ ఆఫీస్ సిబ్బంది,డిఆర్డిఏ.శాఖకు సంబంధించిన అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు..



## శ్రీచైతన్య స్కూల్ లో నాసా కిట్స్ పంపిణీ

**దశ, ఇబ్రహీంపట్నం:** స్థానిక మంచాల రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్ లో నాసా కిట్స్ పంపిణీ కార్యక్రమం గురునానక్ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అయిన డాక్టర్ రఘువీర్ నర్సింగ్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ శ్రీచైతన్య స్కూల్స్ చైర్మన్ యం.శ్రీధర్, డైరెక్ట్రెస్ శ్రీమతి శ్రీవిద్య, ఎజియం శ్రీ పి.వెంకట్ గౌడ్ అభినందనలతో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ గా వ్యవహరించిన డాక్టర్ రఘువీర్ నర్సింగ్ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ వారిలో ఆసక్తి కలిగించే రకరకాల ప్రశ్నలు వేస్తూ, వారికి స్పేస్ కి సంబంధించిన అనేక విషయాలను వివరించి భవిష్యత్తులో శాస్త్రజ్ఞులు కావడానికి వారిలో ఆసక్తి పెంపొందించడం జరిగింది. స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఈకార్యక్రమంలో ప్రసంగిస్తూ శ్రీచైతన్య సంస్థలో చదివిన విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇంజనీర్లు గా, డాక్టర్లు గా, ఐఏఎస్ ఇలా వివిధ హోదాలలో బయటికి వస్తున్నారని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగల శాస్త్రవేత్తలను కూడా తయారు చేసే కార్యక్రమంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. హైస్కూల్ కోఆర్డినేటర్ డి. రమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇబ్రహీంపట్నం నుండి మంచి శాస్త్రవేత్తలు రావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యం. శ్రావణి, హైస్కూల్ డీన్ కె. ప్రవీణ్, సి-బ్యాచ్ ఇంఛార్జి శ్రీనివాస్, స్కూల్ నాసా ఇంఛార్జి శశికాంత్ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు గా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యేకు ఘన సన్మానం

❖ ఘనంగా సన్మానించిన రేవంత్ రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు విజయ్ రెడ్డి



**దశ, ఎల్లారెడ్డిపేట:** కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు గా నియమితులైన చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం ను రేవంత్ మిత్రమండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి శనివారం కలిసి శాలువతో సత్కరించి బుకేతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.రేవంత్ మిత్రమండలి అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి వెంట కిరణ్ గౌడ్,సాయి,నిఖిల్ నరేష్, సత్యం లు ఉన్నారు.

## ఊరి కోసం.. ఉద్యోగాలు వదిలి



**దశ, మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండా గ్రామపంచాయతీకి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న భూక్యా కౌసల్య అనే మహిళ అంగన్వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆమె మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ సోదరుడు దళ్సింగ్ సతీమణి కౌసల్య గత 37 సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహించే వారు గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ ఎస్ టీ మహిళ కావడంతో తాను పోటీ చేస్తున్నందున తాను ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. అదేవిధంగా పర్వతగిరి శివారులోని లక్ష్మతండా గ్రామపంచాయతీకి కాంగ్రెస్ పార్టీ మద్దత్తుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్న బోడ నీల కూడా అంగన్వాడీ ఆయా ఉద్యోగానికి రాజీనామా సమర్పించారు. ఉమ్మడి గ్రామపంచాయతీ పార్వతీగిరి గ్రామం నుంచి ఇద్దరు అంగన్వాడి టీచర్లు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రజలు గొప్పగా చూస్తున్నారు. అదేవిధంగా ఈ ఇద్దరు మహిళలు కావడంతో ఉద్యోగాలు త్రుణపాయంగా వదిలి ప్రజా శ్రేయస్సు కోసమే ముందుకు వచ్చి చేస్తున్న వీరిని ఎలాగైనా గెలిపించి అధిష్టానానికి పంపించాలని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

## జిల్లా మెడికల్ అసోసియేషన్ కార్యదర్శిగా డాక్టర్ అభినయ్

❖ డాక్టర్ అభినయ్ కి గ్రామస్తుల శుభాకాంక్షల వెల్లువ



**దశ ఎల్లారెడ్డిపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నికైన అశ్విని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్.ఈ సందర్భంగా డాక్టర్ అభినయ్ కి వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్న రాము



**దశ, ఆమనగల్లు :** ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి శ్వేత రాము దంపతులు శనివారం మహారాష్ట్రలోని సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు వారికి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందుకున్నారు. వారి వెంట కుటుంబ సభ్యులు మరియు భూపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

## మండలంలో పలు గ్రామాలకు బీజేపీ సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక



**దశ న్యూస్, నడిగూడెం:** సూర్యాపేట జిల్లా బిజెపి అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి ఆదేశానుసారం శనివారం నడిగూడెం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు బండారు వీరబాబు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో పలు గ్రామాల సర్పంచ్ అభ్యర్థుల ను ఎన్నుకున్నారు రామపురం బండారు వీరబాబు యాదవ్, చెన్నకేశవపురం మేకల నాగరాజు, సిరిపురం మొక్క శ్రీనివాస్ గౌడ్, వల్లపురం ఒట్టికూటి నాగమణి, శ్రీరంగాపురం షేక్ లతీఫ్, చాకిరాల మొగలగాని వీరలక్ష్మి, నారాయణపురం నాగిరెడ్డి కవిత, రత్నవరం కనకం గోపి లను నియమించడం జరిగింది. మిగిలిన గ్రామాలకు ఆదివారం ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశం మండల బీజేపీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

❖ జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ" ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై శనివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రతిష్టాత్మకంగా ఎలాంటి లోపాలూ లేకుండా నిర్వహించేందుకు ప్రతి శాఖ అత్యంత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని కలెక్టర్ స్పష్టం చేశారు. డిసెంబర్ 2న మధ్యాహ్నం 2 గంటలకు ఐడీఓసి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో హెలికాప్టర్ ల్యాండింగ్ ఉంటుందని హెలిపాడ్ పరిసరాల్లో గ్రీన్ రూమ్ వాహనం భద్రతా చర్యలు పరిశుభ్రత వంటి అంశాలను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్టేట్ చాంబర్ వద్ద కూడా పరిశుభ్రతను నిర్ధారించి సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్ శిలాఫలకం వద్దకు చేరుకునే వివిఐపీల రవాణా కోసం మినీ బస్సులు ఏర్పాటు చేసి ఈ ప్రక్రియను పాల్వంచ తాసిల్దార్ పర్యవేక్షించాలని ఆదేశించారు. శిలాఫలకం వద్ద పూల అలంకరణ గ్రీన్ మ్యాట్ ఏర్పాట్లు వీఐపీల ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు ఉండేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించాల్సిన పూజా కార్యక్రమాల ఏర్పాట్లపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సింగరేణి మైనింగ్ కాలేజ్ ఏర్పాటుతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందే వరకు జరిగిన చారిత్రాత్మక ఘట్టాలను ప్రతిబింబించేలా ప్రత్యేక ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు కూడా ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో జరగాలని తెలిపారు. వీఐపీల స్వాగతం సన్మాన కార్యక్రమాల్లో పాల్గొనబోయే విద్యార్థులు, ప్రొఫెసర్లు ముందుగానే ఖరారుచేయాలని సూచించారు. ఉదయం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లు కూడా చేయాలని సూచించారు.

అగ్నిమాపకశాఖ తగిన సంఖ్యలో ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు హెలిపాడ్, కాన్వాయ్ మార్గం సభా ప్రాంగణం వద్ద అంబులెన్స్ సేవలు అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి తగిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అంతర్గత రహదారుల మరమ్మత్తులు అకాడమిక్ బ్లాక్ భవనాల వైట్‌వాష్ వంటి మౌలిక పనులను పంచాయతీ శాఖ అత్యవసరంగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. రహదారులు వేదిక సౌండ్ సిస్టమ్ వంటి పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి శాఖకు ఆదేశాలు జారీ చేశారు.

మిషన్ భగీరథ అధికారులు సభా ప్రాంగణం గ్యాలరీలలో తాగునీటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ జనరేటర్లు నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలు విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపాలని సూచించారు. ఇంటర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నిక్, అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు సభలో వచ్చేలా రవాణా శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు భోజన సదుపాయం మహిళా సంఘాల సభ్యుల సమీకరణ పర్యవేక్షించాల్సిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద పుట్టగొడుగుల పెంపకం సోలార్ డ్రైయర్ లైవ్లీహుడ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన అనుమతులు రేపటి కల్లానే పూర్తిచేయాలని డిసెంబర్ 1 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రోటోకాల్ అమలు వీఐపి ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షణలో వ్యవహరించాలని సూచించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి పర్యటన ఓ కీలక మైలురాయిగా నిలుస్తుందని ఈ పర్యటనను ఘనవిజయవంతం చేయడానికి శాఖలు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకుగాను భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమం మొత్తం ప్రోటోకాల్‌కు పూర్తిస్థాయిలో అనుగుణంగా సాగేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని విభాగాల సమన్వయంతో బలమైన భద్రతా ప్రణాళికను సిద్ధం చేసిందని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ బీసీలను మోసం చేసింది

❖ సామ రంగారెడ్డి



**దశ, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత 17శాతం రిజర్వేషన్ ఇచ్చి బీసీలను మోసం చేసిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఖరారు చేయాలంటూ బీజేపీ నాయకులు శనివారం ఎల్బీనగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. నిరసనలో భాగంగా రేవంత్ రెడ్డి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ ని తగలబెడుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు బీజేపీ నాయకులు మధ్య తోపులాట,వాగ్వివాదం జరిగింది. అనంతరం బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.2023 శాసనసభ ఎన్నికల ముందు జరిగిన కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ, బీసీ లకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. 2023లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇస్తూ బీసీలను విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలల్లో రీత్యా అణిచివేస్తున్నారని ఆరోపించారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ జనాభా అధికం ఉన్నప్పటికీ, వారి రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి నిజమైన చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్ కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు గీతా రెడ్డి, నాయకులు నూతి శ్రీనివాస్ రావు, సుందర్ నారాయణ, పంగా శ్యామ్, రాజేష్, మల్లేష్ గౌడ్, కవితా రెడ్డి, నూకల పద్మారెడ్డి, కేశిరెడ్డి పద్మారెడ్డి, గీతా రెడ్డి, వినోద్ యాదవ్, రావుల శ్రీనివాస్ గౌడ్, సంతోష్, నరేశ్ యాదవ్, రాము గౌడ్, శివకుమార్, మనోజ్ కుమార్, రాఘవాచారి తదితరలు పాల్గొన్నారు.



## ఓపెన్ జిమ్ ప్రారంభం

**దశ, ఎల్బీనగర్ :** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఎల్బీనగర్ సీఎం రోడ్, గవర్నమెంట్ స్కూల్ వెనుక ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్ ను శనివారం కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ప్రాంతం ఒకప్పుడు చెత్తతో నిండిపోయి, దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. విద్యార్థులు, స్థానికుల విజ్ఞప్తితో ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రజలు ఇకపై అనారోగ్య సమస్యలు ఎదుర్కోకుండా, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. లింగోజిగూడ డివిజన్‌లో ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు, ఎస్బీహెచ్ కాలనీ వెంచర్-1, వెంచర్-2 సభ్యులు, శాతవాహన కాలనీ, కాకతీయ కాలనీ, నవోదయ కాలనీ, ప్రగతి నగర్, జనప్రియ, కృష్ణానగర్ కాలనీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షాదివస్ : హీరేకార్ రమేష్ జి

**దశ, నల్గొండ:** నందికొండ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా దీక్ష దివస్. దీక్షా దివస్ ను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పైలాన్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా జరుపుకున్నారు కెసిఆర్ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా కెసిఆర్ గారు నవంబర్ 29. 2009 సంవత్సరంలో దీక్ష చేపట్టిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా లక్షలాదిమంది రోడ్లమీద కొచ్చి పోరాడి నందుకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని నాయకులు పేర్కొన్నారు కేసీఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టకపోతే తెలంగాణ వచ్చేది కాదన్నారు కేసీఆర్ గారి ఉద్యమంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలో నుంచి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కెసిఆర్ గారికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేష్ జి సీనియర్ నాయకులు సయ్యద్ గౌస్ భాయ్ సయ్యద్ మక్షుద్ భాయ్ మునావత్ లక్ష్మణ్ నాయక్ చంద్రమౌళి నాయక్ నకిరేకల్ సైదులు ఎల్ దేశనాయక్ కాంపల్లి రామస్వామి దాసరి హనుమంతు పల్లవోలు శ్రీను మంద శాంత ఎం ఎంకోజి సిరికొండ మధు షేక్ రఫీ షేక్ షరీఫ్ షేక్ నజీర్ షేక్ గని పి శివ నాగులుపి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

❖ ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

❖ ప్రపంచ ప్రముఖులకు ఆహ్వానాలు పంపిన ప్రభుత్వం

**దశ, హైదరాబాద్:** తరలిరండి - ఉజ్వల తెలంగాణలో పాలుపంచుకోండి..” అన్న నినాదంతో ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు ప్రపంచంలో పేరొందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, టెక్నాలజీ రంగ నిపుణులు హాజరుకానున్నారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ లో జరగనున్న ఈ సదస్సు నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఇందుకోసం దేశ విదేశాలకు చెందిన దాదాపు 3 వేల మంది ప్రముఖులకు ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాయల్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ కంపెనీల అంతర్జాతీయ స్థాయి సీఈ లు సదస్సుకు హాజరవుతున్నట్టు ఇప్పటికే సమాచారం పంపించారు. యూఏఈ యూ రాజవంశానికి చెందిన, ఎమిరేట్స్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్స్ డైరెక్టర్ షేఖ్ తారిక్ బిన్ ఫైజల్ అల్ ఖసిమి, రస్ అల్ ఖైమా ప్రతినిధులు, డుయిష్ బోర్సే గ్రూప్ హెడ్ లుడ్విగ్ హింజెల్మన్, , ఎన్విషన్ వ్యవస్థాపక భాగస్వామి విన్సన్ , మాండయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ గ్రూప్ సీఈఓ బెన్నెట్ నియో తో పాటు పలు టెక్ కంపెనీల సీఈవోలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ సదస్సులో పాల్గొనడానికి ఇప్పటికే సంసిద్ధతను తెలియజేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ జాతీయ వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం ‘తెలంగాణ రైజింగ్ 2047’ దార్శనిక పత్రం తయారు చేసింది. ఆర్థిక వృద్ధి, అన్ని రంగాల ప్రగతి, సంక్షేమం, సాధికారత, సమ్మిళిత వృద్ధి లక్ష్యంగా భవిష్యత్తు తెలంగాణకు రోడ్మ్యాప్ను రూపొందించింది. ఈ లక్ష్యాలను.. ప్రభుత్వం సంకల్పాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శించేందుకు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ను నిర్వహిస్తున్నాం. తప్పకుండా తరలిరండి..’ అని ముఖ్యమంత్రి పేరిట సందేశంతో ఆహ్వాన లేఖలు పంపించారు.

జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..






# పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

❖ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్

**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా:** ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, ఏ అనుమానాస్పద పరిస్థితులైనా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ, హైదరాబాద్ కార్యకలాపాల క్యాలెండర్ ను అనుసరించి జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి,కార్యదర్శి, డి ఎల్ ఎస్ ఏ పి.లక్ష్మణాచారి సమన్వయంతో శనివారం సిరిసిల్ల పట్టణంలోని మహర్షి ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలపై లైంగిక నేరాల నివారణ, పోక్సో చట్టం కింద ఉన్న కఠిన శిక్షలు, బాధిత పిల్లల హక్కులు,ఫిర్యాదు బాధ్యత వంటి అంశాలను వివరించారు. పిల్లలపై ఏ విధమైన వేధింపులనైనా సహించకుండా చట్టపరంగా చర్యలు తీసుకునేలా ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూర శ్వేత, లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు,గుర్రం ఆంజనేయులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి, ప్యానెల్ అడ్వకేట్ అరుణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ

❖ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది
❖ బిసిలకు అండగా బిఆర్ఎస్
❖ దమ్ముంటే పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టండి
❖ దీక్ష దివస్ లో రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్ర వచ్చిందని ఈ విషయాన్ని కాంగ్రెస్ పెద్దలు గ్రహించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ లో నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రగతి మైదానంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు కూడా కీలక పాత్ర పోషించారని అన్నారు. నాడు కెసిఆర్ తెచ్చిన తెలంగాణ వల్లే నేడు ఎంతో మంది నాయకులు ప్రజా ప్రతినిధులుగా పదవులు అనుభవిస్తున్నారని అది కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని అన్నారు. కెసిఆర్ లేని తెలంగాణ ఎవరు చూడలేరని అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. బీసీలను మోసం చేసి రిజర్వేషన్లకి అడ్డుపడ్డారని దమ్ముంటే ఎంపిటీసీ ఎన్నికల కైనా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని అన్నారు. స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపెడతామని అందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అంకుటిత దీక్ష వల్లనే మనకు తెలంగాణ వచ్చిందని ఎంతోమంది నాయకులు తెలంగాణ కోసం కష్టపడిన చివరికి సాధించలేకపోయారని కానీ అది కేసీఆర్ వల్లే సాధ్యమైందని అన్నారు. కెసిఆర్ తెలంగాణ తీసుకురావడం వల్లనే ఈరోజు ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నారని లేకుంటే ఇలాంటి పదవులు వచ్చాయా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరావు, హరిప్రియ, తెలంగాణ ఉద్యమకారుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ లు ఈ సమావేశంలో కేసీఆర్ ఉద్యమం గురించి తెలంగాణ సాధన గురించి మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపెడతామని అన్నారు. అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్, పాల్వంచ నాయకులు మంతపురి రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, కాంపెల్లి కనకేష్, సింధు తపస్వి, సంకు బాపన అనుదీప్, బత్తుల వీరయ్య, రాజశేఖర్, నవతన్, మాజీ ఎంపీపీలు సోనా, శాంతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు: ఎర్రోళ్ల శ్రీనివాస్



**దశ, ఓయూ:** బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో దీక్షా దివస్ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్యాతిథిగా హాజరై ఆర్ట్స్ కాలేజీ వద్ద మాజీ సీఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కళాకారుల డప్పు సప్పుళ్ల మధ్య టపాసులు కాల్చుతూ బిఆర్ఎస్వీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ వద్ద దీక్షా దివస్లో బిఆర్ఎస్ నాయకులు, బిఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఓయూలో అడగడుగునా నిర్బంధాలు పెడుతున్నారని మండిపడ్డారు. సమైఖ్య రాష్ట్రంలో ఎన్ని నిర్బంధాలు పెట్టిన తెలంగాణ ఉద్యమం ఆగలేదనీ గుర్తు చేశారు. రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే నవంబర్ 29న దీక్ష దివస్లో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ దుర్మార్గపు పాలన నడుస్తుందనీ ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆనాడు తెలంగాణ వచ్చుడో కేసిఆర్ సచ్చుడో అనే నినాధంతో కేసిఆర్ చేపట్టిన దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైందన్నారు. కేసిఆర్ పోరాట స్పూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నాయకులు కోతి విజయ్కుమార్, రామకృష్ణ, మిథున్ ప్రసాద్, పలువురు బిఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## యూజీసీ నిబంధనల ప్రకారం అర్హులైన అధ్యాపకులందరికి ప్రమోషన్స్ ఇవ్వాలి: ఔటా డిమాండ్




**దశ, ఓయూ:** సీఏఎస్ ఇంటర్వ్యూల్లో జరిగిన అవకతవకల వలన ఆర్హులైన చాలా మంది అధ్యాపకులకు ప్రమోషన్స్లో అన్యాయం జరిగిందంటూ ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొంత కాలంగా ఓయూ అధ్యాపకులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఔటా అధ్యక్షులు ప్రొ మనోహర్ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్(యూజిసి) 20102018 నిబంధనల ఆధారంగా ఓయూలోని అర్హులైన అధ్యాపకులందరికి ప్రమోషన్స్ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదనీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, వెంకటదాస్, శ్రీనివాస్ డ్డి, రమేష్, రామకృష్ణ, లోకండే, మాధురీ, సుజాత, శశికళ, రాకేష్ తదితరులున్నారు.

## తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్

❖ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పత్య నాయక్



**దశ, ఆమనగల్లు:** కెసిఆర్ చేపట్టిన అమరణ దీక్ష తెలంగాణ ఉద్యమ గతిని మలుపు తిప్పిందని ఆమనగల్లు మున్సిపాలిటీ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పత్యానాయక్ అన్నారు. నాటి ఆమరణ దీక్ష తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందన్నారు. 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో ' నినాదంతో ఉద్యమం చేపట్టారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేశారన్నారు. శనివారం ఆమనగల్లులో ఆయన చిత్రపటానికి పాలతో క్షిరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీ ఆర్ఎస్ నాయకులు నిరంజన్ గౌడ్, ఖలీల్, మాజీ ఎంపీటీసీ సరిత పంతు నాయక్, మాజీ సర్పంచి సోనా శీను నాయక్, జంగనాయక్, యూత్ వింగ్ అధ్యక్షులు వద్దే వెంకటేష్, మహేష్, పరమేష్, రమేష్ నాయక్, కొమ్ము ప్రసాద్, లండం యాదయ్య, రంజిత్, దేవేందర్, గణేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దీక్ష దివాస్

**దశ, ఆమనగల్లు :** కడ్తాల్ మండలలో దీక్ష దివాస్ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన దశ, దిశను మార్చిన అపురూప ఘట్టం దీక్షా దివస్. 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' కేసీఆర్ శవయాత్రో.. తెలంగాణ జైత్రయాత్రో' అని ప్రకటించి ఆమరణ నిరాహారదీక్ష కోసం సిద్దిపేటకు బయలుదేరి సరిగ్గా నేటికి 16 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ ఎస్ శ్రేణులు దీక్ష దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడ్తాల్ మండలంలోని బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమానికి కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో అమరులయ్యారని వారి ప్రాణ త్యాగానికి ప్రతిఫలం తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. ఈరోజు తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ పార్టీ, అనుభవం లేని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తూ ఉన్నారని ప్రస్తుతం జరగబోతున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, డైరెక్టర్ సేవ్య నాయక్, నాయకులు లాయక్ అలీ, నరసింహ, అశోక్, రామచంద్రయ్య, మహేష్, పాండు నాయక్, దాసు, యాదయ్య, నాగర్జున, కృష్ణ, జంగయ్య, రాజు, శ్రీకాంత్, సురేష్, సత్యం, రవి, వెంకటేష్, జగన్, శేఖర్, కుమార్, అంజి కుమార్, మల్లేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుండంరాజుపల్లి పంచాయతీ కి రెడీ

❖ పోటా పోటీగా ఇరుపార్టీల నాయకులు సర్పంచ్ అభ్యర్థులు ఖరారు
❖ పంచాయితీ ఎన్నికలతో గ్రామంలో సందడి
❖ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గునిగంటి కమలాకర్,
❖ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా చెక్కల శ్రీను
❖ నేటి నుండి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మొదలు
❖ ఇరుపార్టీల సర్పంచ్ అభ్యర్థుల గెలుపు పై ఎవరి ధీమా వారిదే








**దశ, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం గుండం రాజు పల్లి గ్రామంలో పంచాయితీ ఎన్నికల సందడి మొదలైంది, ఎలాగైనా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసి విజయం కేతనం ఎగురవేసి పట్టు సాధించాలని ఉత్సంహంలో ఇరు ప్రధాన పార్టీల కార్యకర్తలు నాయకులు ఉన్నారు, గ్రామాల్లో నోటిఫికేషన్ విడుదలైనా నాటి నుండి అభ్యర్థులు ఎవరనే ఆలోచనలో ఇరు పార్టీల కార్యకర్తలు సందిగ్ధంలో ఉన్నారు ఇక ఆ విషయానికి తెరపడడంతో గ్రామంలో ప్రధాన పార్టీ లైన కాంగ్రెస్, బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేసారు, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గునిగంటి కమలాకర్ బరిలో నిలవగా, బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మాజీ ఎంపిటీసీ చెక్కల శ్రీను బరిలో నిలుస్తున్నారు, దీంతో అభ్యర్థులు ఖరారు కాగా ఓటర్లను ప్రసన్నం చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు, ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు, నేటి నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది దీనితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది దీనితో గెలుపై ఇరుపార్టీల నాయకులు ధీమాతో ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు


❖ సూర్యాపేట జిల్లాలో దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు



**దశ, సూర్యాపేట:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు అధ్యక్షతన శనివారం నాడు జిల్లాలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులు క్రీడల ఆటలు ఆడుతూ స్పోర్ట్స్ ద్వారా దివ్యాంగులలో మానసిక ఉల్లాసం, మనోధైర్యం కలుగుతుందన్నారు , అనంతరం జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. దివ్యాంగులు క్యారం బోర్డ్, చెస్, పరుగుపందెం, షార్ట్ పుట్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకట రమణ, డిఈవో అశోక్, జిల్లా యూత్ & స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సిడీపీవో , సూపర్ వైజర్స్, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, నాయకులు , అపూర్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూపతిపేట చెకపోస్ట్ ను సందర్శించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్









**దశ, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సాగేందుకు జిల్లా పోలీసులు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ అన్నారు. ఎన్నికల సమయంలో జరిగే అక్రమ రవాణా నగదు పంపిణీ మద్యం సరఫరా వంటి చట్టవిరుద్ధ చర్యలను అరికట్టేందుకు జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు పోలీస్ సిబ్బంది డ్యూటీలో ఉంటూ, వాహనాలు - వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. చట్టాన్ని ఉల్లంఘించే ప్రయత్నాలను ముందుగానే నిరోధించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి గస్తీలు, సర్ప్రైజ్ చెకింగ్ మరియు నిరంతర పర్యవేక్షణ ను మరింత బలపరిచినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై తక్షణ చర్యలకు వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే 100కు కానీ సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# సకాలంలో స్పందించిన సూర్యాపేట ఆర్టీసీ, పోలీస్ అధికారులు

❖ బస్టాండ్ లో పోగొట్టుకున్న 44 వేల రూపాయలను ప్రయాణికునికి అందజేత




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్ లో మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రామగిరి రాములు వడ్లు అమ్ముకున్న డబ్బులతో తన స్వంత గ్రామానికి వెళ్లేందుకు తొర్రూరు బస్సు ఎక్కుతుండగా అతని జేబులోంచి 44 వేల రూపాయల నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. అది గమనించిన రాములు తోటి ప్రయాణికుల సహాయంతో ఆ దొంగను వెంబడించగా వారికి చిక్కకుండా పారిపోతూ బస్టాండ్ ఆవరణలో అట్టి డబ్బులు వదిలేసి పారిపోయాడు. అది గమనించిన ఓ ప్రయాణికుడు విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ కి సమాచారం ఇవ్వగా కింద పడేసిన డబ్బులను బస్టాండ్ లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ ఆర్ వి సింగ్ కి అట్టి డబ్బులను అందజేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు బస్టాండ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ యండి అప్సర్ ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ చేతులమీదుగా బాధితుడు రాములుకి అట్టి 44 వేల రూపాయల డబ్బును అందజేశారు. సమయానికి స్పందించి తన డబ్బులను ఇప్పించడంలో కృషిచేసిన ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ ఆర్ వి సింగ్, ఆర్టీసీ కంట్రోలర్ భాస్కర్, కానిస్టేబుల్ యండి అప్సర్ లకు రాములు కృతజ్ఞతలు తెలిపాడు. కష్టపడి వడ్లు పండించి సంపాదించిన డబ్బులు పోవడంతో కన్నీరుమున్నీరైన రాములు అట్టి డబ్బులు తిరిగి రావడంతో అతని ఆనందాన్ని చూసిన తోటి ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తూ సకాలంలో స్పందించిన ఆర్టీసీ, పోలీస్ అధికారులను అభినందించారు.

## మృతుడి కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణి



**దశ, ఎల్లారెడ్డిపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన శివరాత్రి అనిల్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా చైర్మన్ మహమ్మద్ లాలా ఆధ్వర్యంలో వారి కుటుంబానికి నిత్యవసర సరుకులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లాలా మాట్లాడుతూ ఎవరైనా దాతలు ఉంటే వీరి కుటుంబానికి సహాయం అందించి పలువురికి ఆదర్శంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమం లో సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఉడుగుల సురేందర్, సుధమల్ల శ్రీనివాస్, జంపెల్లి అనిల్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా పాటించాలి

❖ ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్
❖ స్పెషల్ మానిటరింగ్ సెల్ సమావేశం



**దశ, రాజన్న సిరిసిల్ల జిల్లా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ మానిటరింగ్ సెల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, స్పెషల్ మానిటరింగ్ సెల్ చైర్మెన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ తో కలిసి శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు.గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్, నిబంధనలకు అనుగుణంగా అర్హతలు, తుది జాబితాలో ఉన్న అభ్యర్థుల వివరాలు ఆయా ఫేజ్ లలో ఎన్నికల ఫలితాలు ప్రకటించే రోజున తెలుపుతామని వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా, ఏకగ్రీవం అయినట్లు ప్రకటించడం, సంబురాలు, వేడుకలు చేసుకోవద్దని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే పోటీలో ఉన్న అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ మానిటరింగ్ సెల్ కన్వీనర్ డీఆర్డీఓ శేషాద్రి, సభ్యులు జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.